ప్రచురణార్థం: ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి శ్రీ పి.మధు, మాజీ మంత్రి శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీ కె.రామకృష్ణ లు గౌరవ నీయులైన జడ్జి (ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ ప్రివ్యూ) గారికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం.

– **జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విజయవాడ,**

**తేది : 25 సెప్టెంబర్, 2020.**

**గౌరవనీయులైన జడ్జి గారికి,**

**ఆంధ్ర ప్రదేశ్ జ్యుడీషియల్ ప్రివ్యూ,**

**అమరావతి.**

**విషయం : రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న మెగా సోలార్ పవర్ ప్రాజెక్టు – జ్యుడీషియల్ ప్రివ్యూ – ప్రతిపాదనలు – అభిప్రాయం తెలియజేయు నిమిత్తం...**

**ఆర్యా,**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే వివిధ ప్రాజెక్టులకు టెండర్లు పిలవడానికి ముందుగానే వాటికి సంబంధించిన సమాచారంతో జ్యుడీషియల్ ప్రివ్యూ వెబ్‌సైట్ ద్వారా ప్రజల ముందుంచడం పాలనలో పారదర్శకత పెరగడానికి దోహదపడుతుంది.

ఈ ప్రక్రియలో భాగంగానే అనంతపురం, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో 6050 మెగావాట్ల సామర్థ్యంతో పది సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించిన సమాచారాన్ని సెప్టెంబర్ 17న వెబ్‌సైట్‌లో ప్రచురించి 25వ తేదీలోగా అభిప్రాయాలు చెప్పమని కోరారు. ప్రతి ప్రాజెక్టుకు సుమారు 250 పేజీల సమాచార పత్రాలు (ఇంగ్లీషులో) చొప్పున దాదాపు 2,500 పేజీలను చదివి, వాటిలోని అంశాలపై అవగాహన కల్పించుకొని, అభిప్రాయాలు తెలియజేయడానికి నిర్దేశించిన వారం రోజుల వ్యవధి చాలదని మనవి చేస్తున్నాము. అందువలన ఈ పది ప్రాజెక్టులకు సంబంధించిన సంపూర్ణ సమాచారాన్ని అధ్యయనం చేసి, వాటిపై విడివిడిగా అభిప్రాయాలు చెప్పగలిగిన అవకాశం లేకుండా పోతున్నది. అయినప్పటికీ పరిమితంగానైనా కొన్ని విధానపరమైన విషయాలను తమ దృష్టికి తీసుకొస్తున్నాము. పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాము.

అన్ని డాక్యుమెంట్లలోనూ చాలా పేరాల్లో అనేక ఖాళీలున్నాయి. కీలకమైన విద్యుత్ స్థాపనా సామర్థ్యంవంటి అంశాలను కూడా నిర్దిష్టపర్చకుండా ఖాళీగా ఉంచడం సరి కాదు. అన్ని డాక్యుమెంట్లలోని ఖాళీలన్నిటినీ భర్తీ చేసి, వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కోరుతున్నాము.

ప్రాజెక్టు పిపిఎల గడువు, భూమి లీజు కాలము, రైతులకు ఎపిజిఇసిఎల్ చెల్లించవలసిన పరిహారము, ఎపిజిఇఎల్‌కు డెవలపర్ చెల్లించవలసిన లీజు మొత్తాలు వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓలు 18, 19, 20లోని విషయాలకు ప్రివ్యూ వెబ్‌సైట్‌లో ప్రచురించిన డాక్యుమెంట్లలో కొన్ని తేడాలున్నాయి.

జిఓ 18లో లీజు కాలము, పిపిఎ గడువు 30(15+15) సంవత్సరాలుగా పేర్కొని, జిఓ 19లో దానిని 25 సంవత్సరాలకు మార్చారు. కాని, ఈ డాక్యుమెంట్లలో ఇవి 30 సంవత్సరాలుగా పేర్కొన్నారు.

భూమికి లీజు రుసుము ఎకరానికి రూ.31,000 ఎపిజిఇసిఎల్‌కు డెవలపర్ చెల్లించాలని జిఓల్లో వుండగా ఈ డాక్యుమెంట్లలో ఒక్కో ప్రాజెక్టుకు ఒక్కో విధంగా రూ.3,000 నుండి రూ.25,000 వరకు ప్రతిపాదించారు. జిఓలను అన్వయించడంలోనూ, రేటులో ప్రాజెక్టులమధ్య కూడా అంత తేడా ఎందుకున్నదీ తగు వివరణ లేదు.

సోలార్ పవర్ ఒక మెగావాట్‌కు ఐదెకరాల భూమి కేటాయింపు చాలా కాలం కిందట నిర్ణయించిన కొలబద్ద. శాస్త్ర సాంకేతికాభివృద్ధి మూలంగా అంత భూమి అవసరం పడకపోవచ్చు. కనుక ఆయా ప్రాంతాలవారీగా నిర్దిష్టంగా ఎంత భూమి అవసరమో తిరిగి లెక్కించి, ఆ మేరకే అనుమతించాలని కోరుతున్నాము.

**"త్రిప్పి చూడగలరు"**

ప్రభుత్వం డెవలపర్లకు కేటాయిస్తున్న భూములు రికార్డుల్లో ఎలావున్నా ఇప్పటికే అనేకమంది పేద రైతులు, అందునా దళిత, గిరిజన, బలహీనవర్గాల అనుభవంలో వున్నాయి. వారందరినీ భూములనుండి వెళ్లగొట్టడం అన్యాయం. భూ సేకరణ చట్టం (2013) ప్రకారం అసైన్డ్ లేదా ప్రభుత్వ భూములతో జీవనోపాధి పొందుతున్నవారికి ప్రైవేటు భూమి మాదిరిగానే నష్టపరిహారం చెల్లించాలి. (ఎసైన్డ్ భూముల సాగుదార్లకూ ప్రైవేటు భూమి మాదిరిగానే నష్టపరిహారం చెల్లించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విస్తృత ధర్మాసనం తీర్పు కూడా ఇచ్చింది.) ఈ ప్రాజెక్టులకు 30,000 ఎకరాలకు పైగా భూమిని తీసుకుంటున్నారు. అంటే ఒక లక్షమందికిపైగా ప్రజల జీవనోపాధి ప్రమాదంలో పడుతుంది. ఈ అంశాలనూ జ్యుడీషియల్ ప్రివ్యూ దృష్టిలోకి తీసుకోవాలని కోరుతున్నాము.

పై విషయాలను పరిగణనలోకి తీసుకొని, ఈ సోలార్ ప్రాజెక్టులకు సంబంధించిన డాక్యుమెంట్లలోని ఖాళీలన్నిటినీ పూరించి, అవసరమైన మార్పులతో తిరిగి సమర్పించవలసిందిగా ఎపిజిఇసిఎల్‌ను ఆదేశించాలని కోరుతున్నాము. వాటిని వెబ్‌సైట్‌లో ప్రచురించి, తగిన గడువు (3 వారాలు) ఇచ్చి అభిప్రాయాలను ఆహ్వానించాలని మనవి చేస్తున్నాము. పైన పేర్కొన్నవి కాక ఇతర అంశాలపై మా అభిప్రాయాలను వివరంగా జ్యుడీషియల్ ప్రివ్యూకు సమర్పించడానికి 3 వారాల గడువు ఇవ్వాలని కోరుతున్నాము.

అభివందనములతో...

సం/-

| | | |
|---|---|---|
| **(కె. రామకృష్ణ)** | **(వడ్డే శోభనాద్రీశ్వరరావు)** | **(పెనుమల్లి మధు)** |
| రాష్ట్ర కార్యదర్శి | మాజీ మంత్రి | రాష్ట్ర కార్యదర్శి |
| సిపిఐ ఆంధ్రప్రదేశ్ సమితి | | సిపిఐ(యం) ఆంధ్రప్రదేశ్ కమిటీ |